# క్రొత్త మాష్టారు

యు సాయిబాబా మాణి విష్ణుమూర్తి



ఆ రోజు శుక్రవారం. మధ్యాహ్నం సెకండ్ అవర్ అయిన తరువాత సెకండియర్ బి ఎస్ సి. అమ్మాయిలంతా వెయిటింగ్ రూమ్‌కి వచ్చారు థర్డవర్ బోటనీ క్లాస్‌కి వెళ్ళటానికి సిద్ధంగా ఉండగా లలిత శారదతో "ఇవాళ మనకి 'ఫంగై' కి క్రొత్త మాష్టారు వస్తారని శేషాచలంగారు చెప్పారుగా," అని గుర్తుచేసింది. అంతే, అమ్మాయిలందరూ తమాషా చేద్దామని క్లాసుకి ఆలస్యంగా వెళ్ళారు. అప్పటికి శేషాచలంగారు క్రొత్త మాష్టారుని పరిచయం చేసి వెళ్ళిపోయారు.

అమ్మాయిలు మెల్లిగా క్లాసు దగ్గరికి వెళ్ళేసరికి మాష్టారు కనుపించలేదు. ఇదేమిటా, అని లలిత క్లాస్‌లోకి చూసేసరికి, అబ్బాయిలతో కలసిపోయి మాట్లాడేస్తున్నారు. అమ్మాయిలందరూ నవ్వుకుంటూ క్లాస్‌లోకి వెళ్ళారు. మాష్టారు అందరి పేర్లూ

అడుగుతుంటే, నవ్వాగక శారద ఫక్కు మని నవ్వింది. దానికి మిగతా అమ్మాయి లంతా శృతి కలిపారు. మాష్టారుకి ఖంగారు పుట్టి, ఉడుకుమోతు తనం వచ్చింది.

క్రొత్త మాష్టారు సన్నగా, పొడవుగా, ఎఱ్ఱగా, మంచి ఉలెన్ సూట్‌లో నీటుగా వున్నారు. పాపం, అమ్మాయిలందరూ నవ్వుతూంటే తికమక పడి, "క్లాస్‌లో నవ్వడం కాదు, ప్రాక్టికల్స్‌లో నవ్వండి తెలుస్తుంది మీ పని" అన్నారు. అప్పటికి ఎల్లాగో బాగుండదని అమ్మాయిలు ఊరు కున్నారు. ఆ రోజు క్లాస్‌లో 'జాగ్రఫీ' చెప్పారు. పాపం కాళ్ళూ, చేతులూ వదులు. అస్తమానం వాటిని ఆడిస్తూ వుంటారు. లలిత ఉండబట్టలేక, "అదేమిటే, శారదా! ఇప్పుడు 'ఫంగై' క్లాస్ అయితే జాగ్రఫీ చెప్తారు?" అని పుస్తకం మీద వ్రాసింది. మీకు తెలిసే వుంటుంది, కాలేజీ అమ్మా యిలు క్లాస్‌లో నోటితో మాట్లాడటం కంటే పేపరు మీద వ్రాస్తూ ఎక్కువ కామెంట్సు చేస్తూ ఉంటారు.


*                    *

క్లాస్‌లో క్రొత్త మాష్టారికి కోపం వచ్చిందని గ్రహించిన అమ్మాయిలు మర్నాడు సరిగ్గా ప్రాక్టికల్స్ టైమ్‌కి వెళ్ళారు. అనుకున్నట్టుగానే ప్రాక్టికల్ డిమాన్‌స్ట్రేటర్ సి. ఎమ్. జి. గారు (అది అమ్మాయిలు పెట్టిన పేర్లెండి. అసలుపేరు సత్యమూర్తి) బదులు క్రొత్త మాష్టారు కనుపించారు. బోటనీ లాబ్‌లో అమ్మాయి లందరూ ఎంతో బుద్ధిగా రికార్డు, అబ్జర్ వేషన్ నోట్సు పట్టుకొని లాబ్‌లోకి వెళ్ళారు.

నంబర్ల ప్రకారం కూర్చోవడం అల వాటు అవడంవలన లలిత మొదట కూర్చుంది. 'కెపారిడే' ఫేమిలీకి సంబం ధించిన 'క్లియోమ్ విస్కోజా' అనే మొక్కను బల్లమీదికి విసిరి, దాని 'హేబిట్, హేబిటేట్ వగైరాలన్నీ వర్ణించమన్నారు. నదురూ బెదురూ లేని లలిత నిలబడి చక చకా చెప్పేసింది. (అంటే, అది అంతకు ముందు క్లాసులో చెప్పేసారు లెండి).

మాష్టారు ఏమీ చేయలేక సెక్షన్సు తీసి బొమ్మలు వేయండి అన్నారు. అబ్బాయిలు ఆ బాచ్‌లో ఇద్దరే ఉండటం వలన పాపం చాలా నెమ్మదిగా కూర్చున్నారు. అమ్మా యిలు సెక్షన్సు తీసి, బొమ్మలు వేసేసి కూర్చున్నారు. మాష్టారు వచ్చి చూశారు. సెక్షన్సు చాలా బాగున్నాయి. ఇంక ఏమీ చెయ్యలేక, 'బొమ్మలు వెయ్యండి' అన్నారు. అంతకుముందే వేసి ఉండటంవల్ల - లలిత నిలబడి, 'వేసేశామండీ, మాష్టారు' అంది. "అయితే వెళ్ళిపోండి' అని పుస్తకంలోకి తల దూర్చేశారు. అమ్మాయిలు గర్వంగా నవ్వుకుంటూ 'లాబ్' లోంచి బయటకి వచ్చారు.

క్రొత్త మేష్టారి పేరు ఏమిటో తెలుసు కోవాలని కుతూహలం వచ్చి అమ్మాయిలు అటెండర్‌ని అడిగారు. అతను 'సత్య నారాయణ' అని చెప్పాడు. లలిత, 'అరెరే




అందరి పేర్లూ ఈ డిపార్టుమెంట్‌లో సత్యనారాయణ లేనే' అని క్రొత్త మాష్టారుకి 'నిక్ నేమ్' ఏమని పెట్టాలా అని ఆలోచించింది. శారద సహాయంతో క్రొత్త మాష్టారుకి 'పుడక' అని పేరు పెట్టింది. శేషాచలం గారికి 'పిడక' అనే పేరు యిదివరకటినుండి ఉంది లెండి.

* *

సోమవారం అయిదు పీరియడ్స్ ఉంటాయి. ఆ రోజు మధ్యాహ్నం ఫస్టవర్ ఇంగ్లీష్ క్లాస్ అయ్యాక, సెకండ్ అవర్ ఫంగై 'పుడక' మాష్టారి క్లాస్ ఉంది. శారద క్లాస్‌కి వెళ్దామని బయల్దేరపోతూంటే, లలిత వెంటనే ఆరోజే ఒక మంచి హిందీ సినిమా రావడం గుర్తు చేస్తూ, క్లాస్ ఎగ్గొట్టేద్దామంది. అందరూ సరేనని 'పుడక' గార్ని పర్మిషన్ అడగటం కోసం డిపార్టుమెంటుకి వెళ్ళారు. అన్నిటికీ ముందడుగు వేసే లలిత ముందు నిలబడింది. శేషాచలం గారికి ఖంగారు ఎక్కువ. "ఏమమ్మా యిల్లా వచ్చారు?" అని అడిగారు. లలిత 'ఫిఫ్త్ అవర్ క్లాస్‌కి రామని సత్యనారాయణగార్ని అడగటానికి వచ్చామండి' అంది. అది వినిపించుకోకుండా, 'సరే వెళ్ళండి' అని ఆగి, "అరే అది నా క్లాస్ కాదు కదూ, సత్యనారాయణగారిది

కదూ! ఏమండీ మాష్టారు, వాళ్ళని పంపించే స్తారా?" అని అడిగారు.

ఇంత జరుగుతున్నా 'పుడక మేష్టారు' తలని పుస్తకంలో దూర్చేసి, తనని కానట్టే కూర్చున్నారు. శేషాచలంగారు అడగటంతో మొహమాట పడిపోతూ, "వెళితే వెళ్ళ మనండి" అని మెలికలు తిరిగిపోతూ అన్నారు.

అంతా ఆ రోజు సినిమా చూసి లలిత ఇంటికి వెళ్ళారు. అక్కడ మళ్ళీ టాపిక్ క్రొత్త మాష్టారు మీదికి మళ్ళింది. ఇంతలో లలిత పెద్దన్నయ్య మాధవరావు అటు వెడుతూ, "ఎవర్ని గురించమ్మా, మరీ అలా ఆట పట్టించేస్తున్నారు?" అని అన్నాడు.

లలిత "సత్యనారాయణగారని క్రొత్తగా లెక్చరర్ వచ్చారు. ఆయన పార్సు చెప్పు కుంటున్నాము," అంది.

మాధవ్, "పిలానీ యూనివర్సిటీనుండి వచ్చాడా?" అని అడిగాడు.

"అవునన్నయ్యా, బి.ఎస్‌సి., బి.టెక్," అని లలిత చెప్పింది. 'అయితే సత్యం ఇక్కడ కాలేజీలో వర్కు చేస్తున్నాడా? వచ్చేముందు నాకు ఒక్కసారైనా వ్రాయ లేదే?' అని ఆశ్చర్యపోయి, 'అయినా నేను మద్రాసులో జాబ్ చేస్తున్న ఎడ్రసు తెలుసు కాని, పాపం, వాడికి నేను మూడు నెలలు సెలవుపెట్టి ఇక్కడ వున్నట్లు ఏం తెలుసు? రేపు కాలేజీకి వచ్చి కలుసుకుంటాను,' అన్నాడు.

ఇంతలో పోస్ట్‌మాన్ 'టెలిగ్రాం, సార్,' అనడంతో అందరూ అటు తిరిగారు. మాధవ్ అన్నయ్య టెలిగ్రాం చూసి, 'అరే, మా బాస్ వెంటనే రమ్మని ఇచ్చాడు. నేను అర్జెంటుగా రేపు వెళ్ళిపోవాలి,' అను కున్నాడు. వాళ్ళ ఫ్రెండ్‌ని కలుసుకో కుండానే మరునాడుదయం వెళ్ళిపోయాడు.


* *

ఫైరట్లో దొరికిన 'ఫంగై' మొక్కని ఒక దానిని తీసికొని వచ్చి బోటనీ డిపార్టు మెంటుకి వెళ్ళి 'ఇది ఏ ఫేమిలీకి చెందినది?' అని లలిత అడిగింది.

శేషాచలంగారు దానిని పరీక్షించినట్లుగా చూసి, 'ఇది బ్రౌన్ ఆల్గేకి సంబంధించినది. ఇంటికి వెళ్ళి రెస్టు తీసోకోవాలమ్మా' అని వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళాక లలితా, శారదా ఒకరి మొఖాలు ఒకరు చూసుకొని నవ్వుకున్నారు. ఎంచేతంటే, ఆయనని ఎప్పుడు ఏది అడి గినా భోజనం చేసి రాలేదనో, చాలా అలసి పోయాను, ఇంటికెళ్ళి విశ్రాంతి తీసోకో వాలనో అంటూంటారు. కాని, లలితకి అది ఫంగైకి సంబంధించినది అని తెలియుట చేత క్రొత్త మేష్టారు (అరే, ఇంకా క్రొత్త మేష్టారు ఏమిటి? సత్యనారాయణ గారి) దగ్గిరికి తీస్కు వెళ్ళి, "ఇది దేనికి సంబంధించినది?" అని అడిగింది.

ఆయన 'ఫంగై' పుస్తకాలన్నీ రిఫర్ చేసి, ఆఖరికి 'అది ఫలానా' అని చెప్పారు. 'మనమంటే ఏమనుకొన్నారో, తడాఖా!'




అని లలితా, శారదా డిపార్టుమెంటునుండి బయట పడ్డారు.

సెకండియర్‌లోనే 'టే క్సా న మీ' ఉండటం చేత శేషాచలంగారు గోదావరి గట్టుకి 'ఎడ్యుకేషనల్ టూర్'కి తీసుక్కెళ్తానన్నారు. అందరూ సరేనన్నారు. మాష్టారు మగవాళ్ళని సైకిళ్ళు తీసుక్కు రావద్దన్నారు. ఎంచేతంటే, ఒడ్డునుండి నడవాలి. రోడ్డు మీద సైకిల్స్ తెస్తే సరిపోదని వద్దన్నారు. ఎవ్వరూ పట్రాలేదు. అమ్మాయిలూ, అబ్బాయిలూ అనుకున్న టైముకి వంతెన దగ్గరకి చేరారు. ఎవరైనా వస్తారేమోనని చూస్తూంటే, క్రొత్త మేష్టారు అనబడే సత్యనారాయణగారు రావడం కన్పించింది.

లలిత శారదతో, 'ఇవాళ మనం మొక్కలన్నీ ఈయన్నే అడుగుదాం,' అంది. సరేననుకొని నడక ప్రారంభించారు. శేషాచలంగారే అందరికీ మొక్కలన్నీ చెప్తూంటే, లలిత మాత్రం ఏ గడ్డి మొక్కనో క్రొత్త మాష్టారి దగ్గరికి పట్టుకొని వెళ్ళి ఎంతో శ్రద్ధ కనబరుస్తూ, 'మాష్టారూ, దీని పేరేమిటండీ' అని వస్తున్న నవ్వును క్రింద పెదవిని పంటితో నొక్కుతూ అదిమిపట్టి, అడిగింది.

బోటనీలో ఆయనకు విజ్ఞానము ఎక్కువగా ఉన్నప్పటికీ ఉద్యోగంలో కొత్తగా చేరటంవలన ప్రాక్టికల్ నాలెడ్జి తక్కువగా ఉంది. అందువలన ఆయన వినిపించుకోకుండా ముందుకు వెళ్ళిపోతూండేవారు.

లలితకి ఉక్రోషం వచ్చి శారదతో, 'శారదా, లాకువద్ద టిఫిన్ దండగే నీకు,' అని శారదను అంటున్నట్లుగా క్రొత్త

మాష్టారివంక చూస్తూ, వెటకారంగా అంది. మొత్తానికి ఆ టూర్ క్రొత్త మాష్టారికి ప్రాణసంకటం గానే పరిణమించిందని చెప్పాలి.

తిరిగి వస్తున్నప్పుడు మాష్టారి సైకిలు లలిత కళ్ళ పడింది. శేషాచలంగారు ఎవ్వరినీ సైకిల్స్ తేవద్దని చెప్పడం చేత, లలిత క్రొత్త మాష్టారికి విన్పించేటట్లుగా, 'ఈ సైకిల్ మన జూ ఆలజీ లెక్చరర్ ఈశ్వర్రావు గారిది కదూ? అయినా ఎదురిల్లేగా,' అని వ్యంగ్యంగా అంది. క్రొత్త మాష్టారికి ఇదంతా చూస్తూంటే తేళ్ళూ, జెర్రెలూ, ప్రాకినట్లు ఉంది, పాపం. ఆ టూర్ ఆ విధంగా ముగిసింది.

మర్నాడు యథావిధిగా అందరూ క్లాస్‌కి వెళ్ళారు. ఆ రోజు ట్యుటోరియల్ క్లాసు. అమ్మాయిలు క్లాస్‌కి వెళ్ళేసరికి అబ్బాయిలందరూ 'ఎస్సే' వ్రాసేస్తున్నారు. మాష్టారు పుస్తకంలోకి తల దూర్చేసి కూర్చున్నారు.

అమ్మాయిలు లోపలికి వెళ్ళి నోట్సు ఎక్కడ వున్నాయా అని క్రిందకి చూడగా, బెంచీల కాళ్ళ దగ్గర నేలమీద పడివున్నాయి పుస్తకాలు. ఈయన పని యిలా ఉందా అని అమ్మాయిలు పుస్తకాలలో వ్రాసిన తరువాత ఎక్కడినుండి తీశారో అక్కడే పెట్టేసి వచ్చేశారు.

ఆ తరువాత ట్యుటోరియల్ క్లాస్‌లో 'ఎస్సే' ఏమి దిద్దారో చూద్దామని పుస్తకం తెరవగానే, ''స్పెల్లింగ్ మిస్టేక్స్, గ్రామర్ మిస్టేక్స్'' అని వ్రాశారు కాని, సబ్జక్టులో ఏమీ తప్పులు దిద్దినట్లు కన్పించలేదు.


దానితో లలితా, శారదా కావాలని 'పక్సీనియా' గురించి వేరు, వేరుగా వ్రాశారు. తర్వాత ట్యుటోరియల్‌లో షరా మామూలు, స్పెల్లింగ్, గ్రామర్ తప్పులు అని వ్రాశారే కాని సబ్జక్టు గురించి ఏమీ వ్రాయలేదు.

ఇంక ఇలా లాభంలేదని, ట్యుటోరియల్‌లో ఎస్సే వ్రాసేసి, 'లైఫ్ సైకిల్స్' వేయటం మానేశారు. తర్వాత ట్యుటోరియల్‌లో బుక్స్ చూసేసరికి, 'లైఫ్ సైకిల్స్, ప్లీజ్!' అన్న రిమార్కుని చూసి ముక్కున వేలేసుకొంది లలిత. మొదట కమాండ్ చేయ బోయారు. అది సాగక పోయేసరికి అభ్యర్థనలలోకి దిగిన ఆయన గూర్చి ఏమనుకోవాలో ఆ అమ్మాయిలు నిర్ణయించుకోలేక పోయారు.

అలా క్రొత్త మాష్టారు ఒక ఏడాది ఉద్యోగం చేశారు. ఏప్రిల్ నెలలో పరీక్షలు అయ్యాయి. బాగా వ్రాశారు అందరూ. టెంపరరీ ఉద్యోగం అవటంవలన క్రొత్త మాష్టారికి ఉద్వాసన వచ్చింది. ఆయన వెళ్ళిపోయారు.

* *

ప్రాక్టికల్ పరీక్షలు పూర్తి అయ్యేసరికి చాలా సెలవలు గడిచిపోయాయి. ఎక్కడికి వెళ్ళాలా అని, 'సమ్మర్ ప్లాన్' లలితా, శారదా కలసి వేస్తుండగా, లలితా వాళ్ళ పెద్దన్నయ్య మాధవ్ చెప్పా పెట్టకుండా మద్రాసు నుండి దిగాడు.



యింట్లో అందరూ ఉత్తరం లేకుండా ఇంత హఠాత్తుగా ఎందుకు దిగాడా అని ఆశ్చర్యపోయారు. శారద వెళ్లొస్తానని చెప్పి ఇంటికి వెళ్ళిపోయింది.

స్నానం చేసి మాధవ్ భోజనం దగ్గర కూర్చుని తల్లితో, "లలితకి పెళ్ళివారిని తీసుకు వచ్చాను" అని చెప్పాడు. "పెళ్ళి కొడుకు నాకు ఫ్రెండే, క్రొత్తగా రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో చేరాడు. జీతం ఏడు వందలు. నా తోనే వచ్చాడు. కాని కతికితే అతకదని పెద్ద లంటారు కదా! అందుకని హోటల్ బృందావన్‌లో దిగాడు," అని చెప్పాడు.

సాయంత్రం పెళ్ళివారొస్తున్నారనీ, లలితకి సాయంగా ఉంటుందనీ, శారదను రమ్మనమని లలిత వాళ్ళ అమ్మగారు పిలిచారు. శారద లలితకు వస్తున్న వరుణ్ణి చూడటం కోసం మంచి ఉత్సాహంగా వచ్చింది.

పెళ్ళివారి కారు గుమ్మంలో ఆగింది. అంతా హాలులోకి వచ్చి కూర్చున్నారు. మాధవరావు హడావిడిగా వచ్చి, లలితని హాలులోకి తీసుకురమ్మని చెప్పి వెళ్ళిపోయాడు. కిటికీలోనుండి పెళ్ళివారిని చూసిన శారద నిర్ఘాంత పోయింది.

తెల్లని పట్టు చీరపై నల్లని జాకెట్ వేసుకొని ముత్యాల హారంకు మేచ్ అయ్యే నల్లపూసలతో కూర్చిన ముత్యాల గాజులూ, చెవులకు రింగులతో, తెల్లని మొహంపై నల్లని ముంగురులు కదలాడుతుండగా హాలులోకి ప్రవేశించిన లలిత, చూడడానికి రెండు కళ్ళు చాలవేమో అనిపించేలా వుంది. యథాలాపంగా తల కొద్దిగా ఎత్తి చూసిన లలిత ఒక్కసారి ఉలిక్కిపడటం వరుడు గమనించి చిన్నగా నవ్వుకున్నాడు. యింతకీ వరుడు ఎవరనుకుంటున్నారు? క్రొత్త మాష్టారు.

పెళ్ళి చూపుల తతంగం పూర్తిఅయిన తరువాత లలిత లోపలికి వచ్చింది. లలిత తనలో తాను, 'క్రొత్త మాష్టారు వదుని రూపంలోవచ్చారు. ఈయన ఎలాగా నన్ను ఒప్పుకోరు, కాలేజీలోనే వేధించుకు తిన్నది, ఈ గడుగ్గాయిని ఎవరు భరించ గలరు?' అని అనుకుంటారు. పాపం, అన్నయ్య శ్రమ వృథా!" అని అనుకుం టుండగానే, మాధవ్ వచ్చి "నిన్ను చేసు కోవడానికి సత్యం ఒప్పుకున్నాడు, తల్లీ" అని సంతోషంగా చెప్పాడు.

అది విని లలిత అమ్మా, నాన్నగార్ల ఆనందానికి హద్దులేదు. ఏడువందల రూపా యల జీతగాడు, కట్నం పుచ్చుకోకుండా కూతురిని వివాహం చేసుకుంటానంటే ఏ తల్లీతండ్రులకు మాత్రం సంతోషంగా ఉండదు! కాని లలిత చాలా భయపడింది.

కాలేజీలో క్రొత్త మాష్టారిని చూసి నవ్వి, ఏడ్పించినందుకుగాను, పెళ్ళిచేసు కొని సాధించాలను కొంటున్నారేమో, ఈ పెళ్ళి యెంత మాత్రం జరగనివ్వకూడదని గట్టిగా నిర్ణయించుకొని, తండ్రి గదిలోకి అడుగుపెట్టిన లలిత, పెళ్ళి ఏర్పాట్ల గురించి ఉత్సాహంగా మాట్లాడుకుంటున్న వారి ఆనందాన్ని చూసి ఏమీ చెప్పలేక బైటకు వచ్చేసింది.

* *

పది రోజుల్లోనే ముహూర్తాలు ఉండటం వలన వివాహం నిశ్చయించేశారు. పెళ్ళికి కాలేజీ లెక్చరర్సు, స్టూడెంట్స్ అంతా వచ్చారు. శారద 'క్లియోమ్ విస్కోజా' మొక్కను, అంటే మాష్టారు ప్రాక్టికల్ క్లాసులో లలితను అడిగిన దానిని, ప్రెస్ చేసి, ఆర్టు పేపరుమీద అంటించి, చుట్టూ లతలు చక్కగా పెయింట్ చేసి, మంచి ఫ్రేమ్ కట్టించి, మాష్టారికి ప్రెజెంట్ చేసింది. మాష్టారు నవ్వుతూ తీసుకున్నారు. కాని లలిత భయం యింకా తీరలేదు.

మర్నాడు కాఫీ, టిఫిన్ తీసికొని లలిత గదిలోనికి వెళ్ళింది. మాష్టారు లలితను చూసి, "కాలేజీలో నీకు పాఠాలు చెప్పిన మాష్టారునే కదా, అప్పుడు అంత ఫ్రీగా నన్ను బెదిరిస్తూ మాట్లాడేదానివి. ఇప్పుడు ఇలా ముడుచుకు పోతున్నావేమిటి?" అని "టిఫిన్ బహుశా ఇప్పుడు దండగేనేమో కదూ?" అని చిరునవ్వుతో అన్నారు.

లలిత కళ్ళముందు "బోటనీ టూర్" కనిపించింది. వెంటనే, "నన్ను క్షమిం చండి" అంటూ కళ్ళ నీళ్ళు గిర్రున తిరుగు తుండగా తల వంచేసుకొంది. ఆయన తల పైకి ఎత్తి హృదయానికి హత్తుకున్నారు.

"నీ ఉత్సాహం చూసి, నీవని తెలిసే పెళ్ళిచూపులకు వచ్చాను. మాధవ్‌తో వచ్చే టప్పుడు అన్ని విషయాలూ — అంటే నువ్వు కాలేజీలో ఏడిపించుకుతిన్న విష యాలన్నీ—చెప్పాను. నేను అవి అన్నీ స్పోర్టివ్‌గా తీసికొన్నాను. ఇంక ఎరువు సైకిల్ నా కెందుకు? మన యిద్దరికోసం స్కూటర్ ఎదురు చూస్తున్నది హైద్రా బాద్‌లో," అని చిలిపిగా అన్నారు.

సెలవు లేదని మూడవ రోజునే లలి తని తీసుకొని హైద్రాబాద్ ప్రయాణ మయ్యారు. కనుమరుగయ్యే వరకూ శారద లలితని చూస్తూ రుమాలు ఊపసాగింది.